# సంఘానికి 6 సందేశములు

## అద్భుత స్వస్థత మరియు పరలోకానికి ఆహ్వానం

### పాస్టర్ బ్రాని డుయోన్




<u>పరిచయం:</u>

2006 వ సంవత్సరం మే నెలలో ప్రభువు సేవకుడు తన రక్షకుడైన ఏసు క్రీస్తును కలవాడానికి పరలోకానికి తీసుకొనిరాబడెను, అతనికి 6 సందేశములు ఇవ్వబడెను.



ఫెఫ్లీ వాడైన బ్రాని డుయోన్ వయస్సు 52 సంవత్సరములు. అతను తూర్పు మలేషియాలోని కోటా బెలుడ్ సబాలో ఉన్న బోర్నియో ఎవాంజలికల్ సంఘపెద్దగా ఉన్నాడు. అతను మెలంగ్కా బారు, కోటా బెలుడ్ నందు సువార్తికునిగా పనిచేసాడు, పిదప 2005 - 2006 కాలంలో సిబ్ బయత్ సంఘ నాయకునిగా ఉన్నాడు.

2006 వ సంవత్సరం, ఏప్రిల్ 21 వ తేదీన నేను నా భార్యతో కలసి పశ్చిమమలేషియాలో మా కుమారుని వివాహం కోసం వెళ్ళాము. అనుకోని విధంగా ఒక వారం తరువాత నాకు స్పృహతప్పింది. వెంటనే నన్ను మలయా విశ్వవిద్యాలయముయొక్క వైద్యకేంద్రానికి తీసుకువెళ్ళారు, అక్కడ ఒక డాక్టర్ నన్ను పరీక్షించాడు. నా మెదడులో కొన్ని కణాలు దెబ్బతిన్నాయని, వెంటనే శస్త్రచికిత్స చేయాలని చెప్పాడు.

నేను శస్త్రచికిత్స తరువాత ఒక వారం అపస్మారకస్థితిలో ఉన్నాను, మరియొక నెలపాటు అత్యవసర చికిత్సావిభాగములో ఉంచబడ్డాను. సిబ్ సబా అధ్యక్షుడు తైపిన్ మెలొడోయ్, ఆయన సహాయకుడు డాటున్ అరున్ సెలుటాన్ మరియు సేవకులు మైకెల్ ఇంకా అనేకమంది దైవసేవకులు నన్ను చూచి నాకొరకు ప్రార్థించారు.

ఒకసారి నాపై కుంభవర్షం కురుస్తున్నట్లు కల వచ్చింది. దీనిని నేను నా స్వస్థతకొరకు దైవసేవకులు చేసిన ప్రార్థనలకు జవాబుగా పరిగణించాను. దేవునికే స్తుతులు, అనుకొన్న దానికంటె ముందుగానే నేను కోలుకొన్నాను.



2006 వ సంవత్సరం మే నెల మూడవ వారం ఒక దినపు అర్ధరాత్రి నేను వొక విచిత్ర భావనకు లోనయ్యాను. మిగిలిన రోగులందరు గాఢనిద్రపోతున్నప్పటికి, నాకు నిద్ర రాలేదు. ఆ సమయములో నా మనస్సు ఏసు పైనే నిలిచిఉంది. యెషయా 43:26 ను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను, "నాకు జ్ఞాపకము చేయుము మనము కూడి వాదింతము నీవు నీతిమంతునిగా తీర్చబడునట్లు నీ వ్యాజ్యమును వివరించుము". నా దృష్టిని ఏసుపై నిలిపి ఈ సంగతులను గురించి ధ్యానించుచుంటిని. ఆ సమయములో దేవుని సన్నిధిని బహుగ అనుభవించసాగాను.

నేను ఆత్మలో ప్రార్థించసాగాను. ప్రార్థించడం ముగించి నిద్రపోవడానికి ప్రయత్నించినప్పటికి నిద్రరాలేదు. మంచంలో అలానడుము వాల్చాను. ఎవరో నా వీపుపైన, తలపైన తట్టుచున్నట్టు అనిపించింది. ఇలా కొంతసేపు జరిగింది. ఏదో ఆశ్చర్యకరమైనదేదో నా శరీరములోనికి ప్రవహిస్తున్నట్లు అనిపించసాగింది. అది బిడ్డపై తండ్రిప్రేమ వంటిది. ఈయన ఎవరో అని ఆశ్చర్యపడసాగాను. ఎవరు అలాచేస్తున్నారో అని చూసేసరికి అక్కడ మంచిశరీరధారుడ్యంకలిగిన ఒక అందమైన యువకుడు బుజాలవరకు వ్రేలాడుతున్న జుట్టుతో ఉన్నాడు. ఆయన తెల్లని వస్త్రాలు ధరించి ఉన్నాడు. అప్పుడు నేను " నేను ధ్యానిస్తున్న ప్రభువు మీరేనా?" అని అడిగాను. ఆయన తల పంకించారు. మరలా నేను" ఆయన కాకపోతే మీరు వేరెవరో తెలుపండి" అని అడిగాను. ఎట్టకేలకు ఆయన మాట్లాడసాగాడు" నేను వర్తాహరుడను, నీకు ఒక శుభవర్తమానం తెలుపమని ఏసు క్రీస్తు నన్ను నీ వద్దకు పంపారు" అని చెప్పాడు.

అతను దేవదూత అని గ్రహించగలిగాను. అప్పుడు నేను" మీరు తీసుకువచ్చిన ఆ శుభవర్తమానం ఏమిటో తెలుపమని" ఆయన్ను అడిగాను. "నీవు ఈ రాత్రి పరలోకరాజ్యమునకు వెళ్లనున్నావు" అని చెప్పాడు. నేను బలహీనముగా ఉన్నప్పటికిని నెమ్మదిని పొందసాగాను. నా శారీరక నొప్పులన్నీ పోయాయి. దేవదూత ఆ మాట చెప్పిన వెంటనే నాకు పూర్తి స్వస్తత పొందాను. ఆ దూతతో " మీ వెంట పరలోకానికి రావడానికి సిద్దంగా ఉన్నాను, నా ప్రభువును చూడాలని చాలా ఆతురతగా ఉంది" అన్నాను.

మేము నడవడం ప్రారంభించినప్పుడు, నా భౌతిక శరీరాన్ని మంచంపైనే వదలివేసినట్లు గమనించాను. ఆసుపత్రి నుండి బయటకు వచ్చినప్పుడు ఎన్నడూ చూడనటువంటి ఒక బలమైన పెద్దగుఱ్ఱాన్ని అక్కడ చూసాను. " మనం ఈ గుఱ్ఱంపై ప్రయాణిద్దాం" అని దేవదూత నాతో చెప్పాడు. ఆ మహాశ్వం పైకి ఎక్కడానికి ఆ దేవదూత నాకు సహాయంచేసాడు. "మనం ఈమహాశ్వం పై పరలోకానికి వెళతామా?" అని నేను అడిగాను. అప్పుడు ఆ దూత " ఔను, భయపడవద్దు, దేవునిచే పరలోకానికి కొనిపోబడిన ఏలియా గురించి చదవలేదా?" అన్నాడు. "ఔను చదివాను, అగ్ని గుఱ్ఱములు పూన్చబడిన అగ్నిరథములపై ఏలియా కొనిపోబడ్డాడు" అన్నాను. "ఔను అది సత్యం, మనం ఇప్పుడు అటువంటి గుఱ్ఱముపై ప్రయాణం చేయబోతున్నాము" అన్నాడు ఆ దేవదూత.
కొంతదూరం నెమ్మదిగా వెళ్ళిన ఆ మహాశ్వం తుఫానుకంటే వేగంగా ప్రయాణించసాగింది. ఆ మహాఅశ్వం ఎగురుతూ కొండలు గుట్టలు దాటుకొంటు దైవ శక్తితో ప్రయాణించసాగింది.

మేము ఒక పెద్ద పచ్చికబయలుకు చేరాము, అక్కడ ఒక్క ఎండు గడ్డిపరకకూడా కనిపించనంత పచ్చగాఉంది. (కీర్తనలు 23:2: పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండచేయును, శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించును). అక్కడ ఆ మహాశ్వం నిలిచింది. మేము క్రిందికి దిగి నడువసాగాము. నా కన్నులయెదుట దేవుని రాజ్యాన్ని చూస్తున్నాను. ఆ పచ్చిక బయలులో నడుస్తున్నప్పుడు ఒక గంట మ్రోగిన ధ్వని వినబడింది. " ఎందుకు ఆ గంట మ్రోగించబడింది?" అని ఆ దేవదూతను అడిగాను. అప్పుడు ఆ దూత " ఒక వ్యక్తి అక్కడకు వచ్చినట్లు గుర్తుగా అది మ్రోగించబడినది" అని చెప్పాడు.

ఆ గంట ఇంకా మ్రోగుచుండగ, మేము ఆ పచ్చికబయలు చివరి వరకు నడచాము. అక్కడ నేను ఒక అందమైన ఇంటిని చూసాను, దానిపై ఒక ఎర్రటి దీపము వెలుగుతూ ఉంది. ఆ దీపముపై 51 అని అంకె వ్రాయబడిఉన్నది. "ఈ సంఖ్య అర్థం ఏమిటని?" ఆ దేవదూతను అడిగాను. " నీ వయసు ఎంత?" అని ఆ దూత నన్నడిగింది. "ఇప్పుడు 51 సంవత్సరాలు" అని చెప్పాను. "అనగా అది నీ వయస్సు మరియూ నీ ఇంటి సంఖ్య కూడాను" అని ఆ దూత చెప్పింది. దేవుడు నా కొరకు సిద్ధపరచిన దానిని చూచినప్పుడు నాకు చాలా నెమ్మది కలిగింది, సంతోషంగా ఉంది. తనయందు విశ్వాసముంచి ఆయనను వెంబడించిన వారికొరకు ఏసు క్రీస్తు సిద్ధపరచిన అనేక నివాసములను ఇక్కడ నేను చూచితిని.

మేము అనేక మంది ప్రజలతో నిండియున్న ఒక పెద్దగృహము వరకు నడచితిమి. వారంతా దేవునిచే ఎన్నిక చేయబడిన పవిత్ర జనాంగమని తలంచితిని. వారంతా దేవుని స్తుతించుచుండిరి. అక్కడ ఒక సింహాసనముపై ఏసుక్రీస్తు ఆశీనుడై యుండెను, వారంతా ఆయనను స్తుతిస్తూ

ఆరాధించుచుండిరి. వారు తమ చేతులెత్తి నాట్యంచేస్తూ, ఆయనముందు మోకరించుచూ హృదయపూర్వకముగా ఆయనను స్తుతించుచుండిరి. అప్పుడు నేను నా అంతరంగములో ఇట్లనుకొంటిని " లోకములోని జనులెల్లా ఈ విధముగా దేవుని ఆరాధించినయెడల ఆయన తప్పక సంతోషించును గదా?"

అనేకమంది ఆయనను స్తుతిస్తూ రోదించుచుండుట నేను చూచితిని. వారి భక్తిని గమనించుచుండిన ఏసు సంతోషించుచుండెను. వారు తమ చేతులను ఏసు వైపునకు చాపుచుండిరి, ఆయన వారిని ఆశీర్వదించుచుండెను. ఆరాధన ముగిసిన పిదప ఏసు వారిమధ్యలో నడచుచూ వారి కన్నీరు తుడచు చుండెను. అప్పుడు నేను ప్రకటన గ్రంథములోని ఈ వాక్యమును జ్ఞాపకము చేసుకొంటిని "ఇకమీదట మరణమైననూ, బాదయయినను, కన్నీరైనను, వేదనయయినను ఉండదు".

ఆ దూత నన్ను ఏసునొద్దకు తీసుకొనివచ్చింది. ఆ దూత ఏసుతో " ప్రభువా ఇక్కడకు తీసుకురాబడుటకు నీవు ఎన్నుకొన్న నీ ప్రియ బిడ్డ ఇడుగో" అని చెప్పింది. అప్పుడు ఏసు నావైపు తిరిగి "నీవు ఈ దినము నా దగ్గరకు వచ్చుట నాకు చాలా సంతోషము" అని నన్ను కౌగలించుకొన్నారు, వెంటనే సమాధానముతో సంతోషభరితుడనై, ఏడ్వసాగాను. ఏసు ప్రభువే స్వయంగా నన్ను ఆలింగనము చేయుట వలన నా ఆత్మ సంతోషంతో గంతులువేయసాగింది.

అప్పుడు ఆ దూత ఏసుతో "ప్రభువా ఇతనిని దర్శించుటకు నేను వెళ్ళేసరికి ఇతడు రోగగ్రస్తునిగ ఉన్నాడు, ఇప్పుడు బాగయ్యాడు" అన్నాడు. "ఔను అతనికి సంభవించినదంత నేను విన్నాను, చూసాను" అని ఏసు అన్నారు. దూత మరలా " నేను అక్కడికి చేరేసరికి ఇతని భార్య మీ సహాయము కొరకు మొఱ్ఱపెట్టుచుండెను, ఆమె 'ప్రభువా మాకు సహాయము చేయుము, ఈయను తీసుకొనిపోవద్దు, ఆయన లేకుండ మేము ఉండలేము' అని మొఱ్ఱపెట్టుచుండెను" అని ఏసుతో చెప్పెను. అప్పుడు ఏసు "అన్నీ నాకు తెలుసు, ఇతని భార్య నమ్మకస్తురాలైన, ప్రార్థనయందు యొడతెగని పట్టుదలగల స్త్రీ" అన్నారు. నా భార్యకు దేవుని యెడలగల నమ్మకత్వమును బట్టి బహుగా నా ఆత్మ మూలుగుచుండెను.

అప్పుడు ఏసు నాతో" నా కుమారుడా, నీవు తిరిగి భూమికి వెళ్ళెదవు, నీ సమయమింకా రాలేదు, నీవు తీరిక లేనంతగా నాకొరకు ప్రయాస పడవలసియున్నది" అన్నారు. అప్పుడు నేను "ప్రభువా నన్ను తిరిగి భోలోకమునకు పంపివేయవద్దు, నీ సన్నిధిలో ఎంతో సంతోషమును, సమాధానమును అనుభవించుచుంటిని, నేను తిరిగి వెళ్ళను ప్రభువా" అని వేడుకొంటిని.

నా విన్నపమును విన్న ఆయన ముఖకవళికలను బట్టి ఆయన నా మాటలను బట్టి కొంత అసంతుృప్తిచెందినట్లుగ కనబడెను. ఆయనను నేను అసంతృప్తిపరచినదానిని బట్టి వెంటనే ఆయనను క్షమాపణ వేడుకొంటిని. " ప్రభువా మీరు ఆజ్ఞాపించిన విధముగా నేను వెళ్ళెదను, కానీ నన్ను మీరు బలపరచి, నేను వెళ్లుచోట్లనెల్లా నాకు తోడుగా ఉండి నన్ను ఆదరించి కాపాడండి" అని వేడుకొంటిని. అప్పుడు ఏసు " భయపడకుము. నీవు నా పరిచర్య నిమిత్తమై ఎక్కడికి వెళ్ళినను నేను నీకు తోడుగ ఉంటాను" అని సెలవిచ్చారు.

ఏసు నా ద్వారా ప్రజలకు కొన్ని సందేశములు పంపాలని కోరుకొంటున్నారు. నేను ఈ సందేశములను దేవుని ప్రజలకు అందించాలని ఆయన కోరుకొంటున్నారు. "ఈ సందేశములు తన బిడ్డలకు చాలా ముఖ్యమైనవని" ఏసు చెప్పారు. ఈ సందేశములను నేను ప్రజలకు అందించాలని తద్వారా ప్రజలు తనను వెంబడించుటలో బలపడాలని కోరుకొంటున్నట్లు ఏసు నాతోచెప్పారు. "నీవు తిరిగి భూమికి వెళ్ళిన పిదప ఈ సందేశములను తప్పనిసరిగా తన ప్రియ బిడ్డలకు అందించాలని" ఏసు చెప్పారు. (ఏసు నాకు 6 సందేశములను ఇచ్చారు).

### *మొదటి సందేశము:*

"నా ప్రియ బిడ్డలు నా యందు మనఃపూర్వకముగా, ఆత్మపూర్వకముగా, తమశక్తికొలదిగా విశ్వాసముంచాలి. ఎవరైతే ఆందోళనతో, అపనమ్మకముతో ఉంటారో వారు పరలోకరాజ్యములో ప్రవేశింపరు అని తెలియజేయాలి".

### *రెండవ సందేశము:*

" నా ప్రియ బిడ్డలు విశ్వాసముతో నా మందిరమునందు ఆరాధనకు తప్పక హాజరుకావాలని, అక్కడ వారు నన్ను దర్శించగలరని, నేను వారిపై ప్రకాశిస్తానని, నా ప్రజలు నన్ను నా పరిశుద్ధమందిరము నందు అరాధించుట చూచినప్పుడు నాకు చాలాసంతోషము కలుగుతుందని తెలియజేయాలి".

### *మూడవ సందేశము:*

"నా ప్రియ బిడ్డలు విశ్వాసముతో ప్రార్థించాలి, నా చిత్తాన్ని జరిగించాలి, నా మాట వలన జీవించాలి అని తెలియజేయాలి".

### *నాలుగవ సందేశము:*

"నా ప్రియ బిడ్డలు తమ దశమభాగములను, కానుకలను మనఃపూర్వకముగా అర్పించాలని తెలియజేయాలి".

(ఈ సందేశములను ఇచ్చుచు ఏసు నాతో " నా ప్రియ బిడ్డా , అటు చూడు" అని తన ప్రియ బిడ్డలకొరకు సిద్దపరచిన భవంతులను నాకు చూపారు. " ఈ భవనములను నేను నాయందు విశ్వాసముంచి, నాకు విధేయులుగ జీవించినవారికొరకు సిద్దపరచాను". తరువాత నిర్మాణము పూర్తికాని భవనములను నాకు చూపారు. నేను అప్పుడు " ప్రభువా ఇవి ఇంకా ఎందుకు పూర్తిగా నిర్మించబడలేదు?" అని అడిగాను. అప్పుడు ఏసు " ఇవి ధారాళముగా తమ కానుకలను, దశమభాగములను ఇవ్వని నా బిడ్డలకు చెందినవి. నా మందిరములో వారు ధారాళముగా తమ దశమభాగములను, కానుకలను ఇవ్వడం ప్రారంభించగనే ఇవి పూర్తి చేయబడతాయి" అని చెప్పారు.)

### *అయిదవ సందేశము:*

"నా ప్రియ బిడ్డలు తమకు భూమిపై అనుగ్రహింపబడిన సమృద్ధి మరియు ఆశీర్వాదములను ప్రార్థనల ద్వారా నా కాపుదలకు అప్పగించాలి. అలా చేయడంద్వారా నా రెండవ రాకడలో వారు తమ సమృద్ధికి ఆశీర్వాదములకు ఆకర్షింపబడరు. లోతు భార్యయొక్క ఇతివృత్తమును జ్ఞాపకముచేసు కొనవలెనని వారికి తెలియజేయాలి".

### *ఆరవ సందేశము:*

"నా ప్రియ బిడ్డలు ఎల్లప్పుడు నా రాకడకు సంసిద్దులుగా ఉండాలి, ఎందుకనగా నేను వారు తలంచు సమయము కంటే ముందుగా రానైఉన్నాను అని తెలియజేయాలి".

(ఏసు క్రీస్తు ఎప్పుడు రానైయున్నారో మనకు తెలియదు గాని. ఆయన రావడంమాత్రం తథ్యం. ప్రభువైన ఏసు త్వరలో రానైఉన్నారు.)

ఆయన తన 6 వ సందేశము చెప్పిన పిదప ఆకాశమును చూపించారు, అది మేఘాలు లేకుండా నిర్మలంగ ఉంది. ఏసు తన చేతులను భూమివైపు తెరచి "నేను నా ప్రియబిడ్డలను ఇక్కడికి ఆహ్వానిస్తాను" అని అన్నారు. అనేకమంది తెల్లని వస్త్రములు ధరించి ఎగురుకొంటూ ఏసును కలసుకోవడానికి రాసాగారు. వారు ఏసుకు కుడి ప్రక్కన ఎడమప్రక్కన నిలబడ్డారు. ఏసు నందు నమ్మికయుంచిన అనేకమంది తీసుకురాబడ్డారు. కొన్ని కుటుంబాలలోని మొత్తము సభ్యులందరూ తీసుకురాబడ్డారు. భార్య, భర్త తమ బిడ్డలతో ఎగురుకొంటూ వచ్చారు. ఈ దృశ్యం చాలా మనోహరముగా ఉంది.

అప్పుడు ఏసు " క్రిందికి చూడు" అని వక్కాణించారు. ఏసు భూమిపైని పరిస్థితిని చూపించారు, అక్కడ అంతా గందరగోళముగా ఉంది. అక్కడ నెమ్మది అనేది లేదు. ప్రజలు అరుస్తూ పరుగులు తీస్తున్నారు. తల్లిదండ్రులు తమబిడ్డలకొరకు, బిడ్డలు తమ తల్లిదండ్రుల కొరకు వెదుకుచున్నారు.

ఏసు మా ఊరిలోని సంఘాన్ని చూపించారు. అక్కడ కొంతమంది విడువబడుట చూడగా నాకు దు:ఖము కలిగింది.

అప్పుడు ఏసు నాతో " విశ్వాసము కలిగియుండు. నీవు చూచినవాటిని, విన్నవాటిని భూమి మీద నా ప్రియ బిడ్డలకు తెలియజేయాలి" అని చెప్పారు.

అప్పుడు దేవదూత నన్ను తిరిగి అదే మహాశ్వముపై భూమిపైకి తీసుకు వచ్చాడు. చాలా వేగంగా భూమిని చేరుకొన్నాము. ఆసుపత్రిలో నన్ను ఎక్కడి నుండి తీసుకువెళ్ళిందో అక్కడకు చేర్చింది. అక్కడ పడిఉన్న నా బాహ్యశరీరమును చూడగానే నా ఆత్మ అందులో ప్రవేశించింది.



నేను పరిపూర్ణముగ స్వస్థపరచబడ్డాను. దేవుని మహాశక్తిని బట్టి ఆయనకే మహిమ కలుగును గాక!

పరలోకములో నేను ఉన్నప్పుడు నా శరీరము యవ్వనముతో నిండి ఉంది.

ఇది నేను పరలోకములో ఏసుక్రీస్తును కలుసుకొన్న సాక్ష్యానుభము.

**Translated to Telugu by T. J. H. Prasad Babu, prasadbabutjh@gmail.com**